క్లుప్తంగా

విద్యార్థులకు పోటీలు



వివిధ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం నగరంలోని వివిధ కళాశాలలతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు సమాజంలో గ్రంథాలయాల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం శేఖర్‌బాబు అధ్యక్షత వహించారు. మధ్యాహ్నం కళాశాల విద్యార్థులకు, పాఠశాలల విద్యార్థులకు వార్తా పత్రికల ఉపయోగాలు అనే అంశంపై వక్తృత్వ పోటీలు రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి వై.ఆనంద నాయుడు, చలసాని వెంకట సురేంద్ర నిర్వహించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఈనెల 20న జరిగే గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభలో అతిథులు ప్రదానం చేస్తారని గ్రంథాలయ సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటీ సందీప్ కుమార్, లెక్చరర్లు, ఉపాధ్యాయులు, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది, 300 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మహాసభ పోస్టర్ విడుదల

ఏలూరు (మెట్రో) : విజయవాడలో డిసెంబర్ 10న నిర్వహించే రాష్ట్ర స్థాయి ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మహాసభను విజయవంతం చేయాలని ఏపీ జేఏసీ అమరావతి ఏలూరు జిల్లా చైర్మన్ రమేష్ పిలుపునిచ్చారు. ఏలూరు రెవెన్యూ భవనంలో మహాసభ పోస్టర్‌ను ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో కలిసి శనివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఈ సభకు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రులు హాజరవుతున్నట్లు తెలిపారు. సమాన పనికి సమాన వేతనం, సీనియారిటీ ప్రకారం వార్షిక ఇంక్రిమెంట్, ప్రభుత్వ పథకాలు వర్తింపచేయడం తదితర అంశాలపై మహాసభలో చర్చిస్తారన్నారు. టి.రవీంద్ర కుమార్, టి.ఉమాసత్యనారాయణరావు, వి.రమేష్, కె.నాగభూషణం, ఎం.భాస్కరరావు, వి.గోవర్ధన్, సీహెచ్ నాని, హైమావతి, ఎ.పద్మ పాల్గొన్నారు.

మహాధర్నా వాల్ పోస్టర్ విడుదల

ఏలూరు (టూటౌన్): ఈనెల 20న ఏలూరు కలెక్టరేట్ వద్ద దళిత సేన ఆధ్వర్యంలో నిర్వహించే మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ కోరారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని రాష్ట్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మహాధర్నా వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బడుగు, బలహీన వర్గాలు సాగు చేసుకుంటోన్న పోరంబోకు భూములు, గట్టు పోరంబోకు భూములు, గయ్యాలి, అటవీ భూములకు సాగు పట్టాలు ఇవ్వాలని రవిప్రకాష్ కోరారు. పంచాయతీ తీర్మానం అవసరం లేకుండా అసైన్డ్ కమిటీ ద్వారా సాగు పట్టాలు మంజూరుకు ప్రభుత్వం ప్రత్యేక జీవో జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. డప్పు కళాకారులు, చెప్పులు కుట్టే కార్మికులకు నెలకు రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలని, సబ్సిడీ రుణాలు అందించాలని, కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారా లెదర్ పార్కులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బేతాళ జయసుధ, పింగుల ఇథియా, విజయమ్మ, మరియమ్మ, దేవమాత, లక్కపాము దాసు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

కామవరపుకోట: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడటంతో యువకుడు మృతిచెందిన ఘటన కామవరపుకోట శివారు జీడిగింజల ఫ్యాక్టరీ సమీపంలో శనివారం జరిగింది. తడికలపూడి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు మండలం పోణంగి గ్రామానికి చెందిన వేమూరి నాగేంద్ర (26) తాపీ పనిచేస్తుంటాడు. శనివారం సాయంత్రం పోణంగి నుంచి బయలుదేరి టి.నరసాపురం మండలం, అల్లంచర్ల కొత్తగూడెం బంధువుల ఇంటికి వెళుతుండగా కామవరపుకోట శివారు జీడిగింజల ఫ్యాక్టరీ సమీపంలో వచ్చేసరికి తను నడుపుతున్న ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడటంతో, తలకి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 వాహనానికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి ఏలూరు ఆసుపత్రికి తరలించిగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై తడికలపూడి ఎస్సై జయబాబు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువత క్రీడల్లో సత్తా చాటాలి

ఏలూరు (టూటౌన్): నేటి తరం యువత క్రీడల్లో రాణించడం ద్వారా తమ సత్తా చాటాలని సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ పిలుపునిచ్చారు. స్థానిక 50వ డివిజన్ పరిధి చొదిమెళ్లలో శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో తపన ఫౌండేషన్ ద్వారా వాలీబాల్, క్రికెట్ కిట్లను 27, 29, 50 డివిజన్లకు చెందిన యువతకు అనంత శ్రీరామ్ చేతులు మీదుగా అందజేశారు. యువత కోరిక మేరకు ఆయన కొన్ని సినిమా పాటలు పాడి అలరించారు. కార్యక్రమంలో నగరపాటి సత్యనారాయన, నడపన దాన భాస్కరరావు, ఆర్కె, కొండేటి రమేష్, సరస్వతి, పవన్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



లంకపేటలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించిన ఎమ్మెల్యే నాని



ఓ మహిళకు పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే నాని

ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించటమే ప్రధాన లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో పనిచేస్తున్నామని, ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆయన నగరపాలక సంస్థ అధికారులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులతో గడపగడపకు కార్యక్రమంపై సమీక్షించారు. ఏలూరు 8వ డివిజన్ 57వ సచివాలయం పరిధిలో ఇటీవల నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారంపై అధికారులతో ఆయన సమీక్షించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు పలు సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తున్నారని, వాటిని సత్వరమే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల వినతులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. 57వ సచివాలయం పరిధిలో 8వ డివిజన్‌లో సుమారు రూ.40 లక్షలు అభివృద్ధి పనులకు ఆయన ఆమోదం తెలిపారు. డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, కార్పొరేటర్ వంకదారు ప్రవీణ్, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ ఉన్నారు.



సంక్షేమ బోర్డును ఆవిష్కరించిన మైబాబు

రాష్ట్రంలో జగనన్న ప్రజారంజక పాలన

దేశ చరిత్రలో సువర్ణఅధ్యాయం లిఖించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరు నగరంలో 124వ రోజు 29వ డివిజన్ లంకపేటలో శనివారం సాయంత్రం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ జగనన్న పాలనలో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా నేరుగా ప్రజలకు ప్రభుత్వ సేవలు ఉచితంగా అందుతున్నాయని చెప్పారు. పింఛన్, ఇళ్లు, కార్డు, సంక్షేమ పథకం ఏదైనా అర్హత ఉంటే చాలు రాజకీయ పార్టీలకు అతీతంగా అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే అన్నారు. కార్యక్రమంలో మేయర్ షేక్ నూర్జహాన్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఆర్ పెదబాబు, జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, కార్పొరేటర్ ఉప్పల సుజిత ఉన్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన

గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్ మాత్రమే అని పార్టీ జిల్లా కోశాధికారి మైబాబు అన్నారు. ఏలూరు 28వ డివిజన్ శనివారపుపేటలో శనివారం వై ఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమాన్ని ఉత్సాహంగా చేపట్టారు. తొలుత పార్టీ జెండాను, డివిజన్‌లో ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా అందిస్తోన్న సొమ్ముల వివరాలతో కూడిన సంక్షేమ బోర్డును ఆయన ఆవిష్కరించారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి ప్రజలు ఏలూరులో ఎమ్మెల్యే ఆళ్ల నానికి, సీఎం జగనన్నకు పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కొలికిపాముల తిరుపతిరావు, కొల్లిపాక సురేష్, ఎర్రా కిరణ్, అప్పలనాయుడు, మీనాక్షి, రఘు, శ్యామ్, అమీనా అన్సారీ తదితరులు ఉన్నారు.

ఎంటీఎస్ టీచర్లను రెగ్యులర్ చేయాలి



ఎంపీ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎడ్వర్డ్

ఏలూరు(ఆర్ఆర్‌పేట): 1998వ సంవత్సరంలో డీఎస్సీ రాసి అర్హత సాధించిన ఎంతో మందికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మినిమమ్ టైం స్కేల్ (ఎంటీఎస్) ప్రాతిపదికన ఉద్యోగావకాశాలు కల్పించి తమ జీవితాల్లో వెలుగులు నింపారని, తమ ఉద్యోగాలను రెగ్యులర్‌చేసి మరింత వెలుగులు నింపాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాని కోరుతూ 98 డీఎస్సీ, సెలెక్ట్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట ఎడ్వర్డ్ కోరారు. ఈమేరకు శనివారం ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఏలూరు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబుతో కలిసి ఎంపీ కోటగిరి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. గత ఏప్రిల్ 13న తమకు ఎంటీఎస్ టీచర్లుగా నియామకాలు కల్పించారని, అప్పటికే తాము 25 సంవత్సరాల సర్వీసు కోల్పోయామని దాదాపు 90 శాతం మంది వయస్సు మీరిపోయి పదవి విరమణకు దగ్గరలో ఉన్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మానవతా దృక్పథంతో వయస్సుమీరి ఏ పనులు చేయలేని పరిస్థితుల్లో ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న ఎంటీఎస్ టీచర్లకు 12 నెలల జీతాలు ఇప్పించాలని, పదవి విరమణకు దగ్గరలో ఉన్న వారికి పదవి విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



మహిళా పారిశ్రామికవేత్త నీలిమను సత్కరిస్తున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అన్ని రంగాల్లో రాణిస్తోన్న మహిళలు పారిశ్రామికవేత్తలుగానూ ఎదగాలని కోకో ట్యాంగ్ ఇండియా సంస్థ వ్యవస్థాపకురాలు టి.నీలిమ పిలుపునిచ్చారు. స్థానిక సీఆర్ రెడ్డి కళాశాల, సీఐఐఈ, ఈడీసీ, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్, ఎంబీఏ, ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మహిళా పారిశ్రామికవేత్తల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నీలిమ మాట్లాడుతూ మహిళలు ఆత్మవిశ్వాసం నమ్మకం, ప్రణాళిక నైపుణ్యాలోచనలు కలిగి ఉండాలన్నారు. సాంఘిక, సామాజిక పరమైన అవగాహనతో ఎదురయ్యే ప్రతి సవాళ్లనూ దీటుగా ఎదుర్కోవాలని సూచించారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహకాలు, బ్యాంకు రుణాలు, సబ్సిడీలను వినియోగించుకొని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. తాను డెంటల్ డాక్టర్‌గా జీవితాన్ని ప్రారంభించి పారిశ్రామికవేత్తగా ఎదిగిన తీరును వివరించారు. కార్యక్రమంలో డిగ్రీ, పీజీ కళాశాలల కరస్పాండెంట్స్ కేఎస్ విష్ణుమోహన్, కానాల శ్రీనివాసరావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.విశ్వేశ్వరరావు, పీజీ డైరెక్టర్ వీఆర్ఎస్ బాబు యలమర్తి, సీఐ ఐఈ, ఈడీసీ కో ఆర్డినేటర్ తేరా రాజేష్, ఈడబ్ల్యూసీ కోఆర్డినేటర్ ఎస్ హేమలత, ఐక్యూఏసీ కన్వీనర్ జి.రాము, ఈడీసీ సభ్యులు అధ్యాపకులు టి.శ్యాంప్రసాద్, వి.శ్రీనివాసరావు, ఎం ఉపేంద్ర, డైరెక్టర్ ఆర్ శ్రీనివాసరావు నీలిమను సత్కరించారు. వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హోంమంత్రిని టార్గెట్ చేయడం తగదు



సమావేశంలో మాట్లాడుతున్నపెరికె వరప్రసాదరావు

ఏలూరు (టూటౌన్): దళిత హోంమంత్రి తానేటి వనితను టార్గెట్ చేయడం టీడీపీ నాయకులకు తగదని, కొవ్వూరు నియోజకవర్గంలో బొంత మహేంద్ర ఆత్మహత్య మరణాన్ని కొంతమంది స్వార్థ రాజకీయాలు చేసి ఉపయోగించుకోవడం బాధాకరమని నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు, ఏపీ పాస్టర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి రెవరెడ్ పాస్టర్ జీవన్‌కుమార్‌లు తీవ్రంగా ఖండించారు. స్థానికంగా శనివారం వారు విలేకర్లతో మాట్లాడారు. హోంమంత్రి వనితను టీడీపీ, జనసేన, ఎల్లో మీడియా టార్గెట్ చేయటం ఏమిటని ప్రశ్నించారు. ఎస్సీ మంత్రులను టార్గెట్ చేసి టీడీపీ బ్లాక్ మెయిల్ రాజకీయాలుచేసి రాజకీయ పబ్బం గడుపుకుంటోందని విమర్శించారు. దొమ్మేరులో మహేంద్ర మరణంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తక్షణం స్పందించి రూ.20 లక్షలు ఆర్థికంగా ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులపైన ఇలాంటి దాడులను తిప్పికొడతామని హెచ్చరించారు. టీడీపీ, జనసేన పార్టీలు ఎన్నికుట్రలు పన్నినా వచ్చే 2024లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అవ్వడం ఖాయమని, రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఆయనతోనే ఉన్నారని వివరించారు. కార్యక్రమంలో ఏపీ పాస్టర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి రత్న ప్రసాద్, బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కులగణనను స్వాగతిస్తున్నాం



కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు వినతిపత్రం అందిస్తున్న సంతోష్ కుమార్



కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న శివశ్రీ

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో కులగణన చేపట్టేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు ప్రారంభించడాన్ని స్వాగతిస్తున్నట్లు ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్‌కుమార్ అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని పలు సూచనలు, సలహాలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధికంగా మాల కుల జనాభా ఉందన్నారు. 1931లో ఎస్సీలకు 15 శాతం రిజర్వేషన్లు ఇచ్చారని, అయితే ప్రస్తుతం ఎస్సీల జనాభా 50 కోట్లు దాటిందన్నారు. దీని ప్రకారం రిజర్వేషన్లు మూడు రెట్లు పెంపుదల చేయాల్సిన అవసరం ఉందన్నారు. దాదాపు 92 సంవత్సరాల తర్వాత రాష్ట్రంలో కులగణన చేపట్టడాన్ని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం, ఎస్సీ హక్కుల పరిరక్షణ సంఘం తరుపున స్వీకరిస్తున్నామన్నారు. కులగణన ద్వారా వంద శాతం న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నామన్నారు. కులగణన సర్వే చేసి దానికి చట్టబద్ధత కల్పించి వీరికి ఆర్థిక, రాజకీయ, విద్యా విధానంలో న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.


కులగణనలో విశ్వబ్రాహ్మణులుగా నమోదు చేయాలి

ఏలూరు (టూటౌన్): వంశపారంపర్యంగా ఐదు వృత్తులపై జీవిస్తున్న విశ్వబ్రాహ్మణులను వృత్తులపేర్లతో కాకుండా కులగణనలో విశ్వబ్రాహ్మణులుగా నమోదు చేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి, విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం రాష్ట్ర ప్రధాన సంచాలకులు అప్పలభక్తుల శివకేశవరావు (శివశ్రీ) కోరారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ హాలులో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన మేధావుల, కుల సంఘాల ప్రతినిధుల సమావేశంలో ఈమేరకు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. విశ్వబ్రాహ్మణులను కంసాలి, వడ్రంగి, కంచరోళ్లు వంటి వృత్తి పేర్లతో పిలవడాన్ని నిషేధించాలని కోరారు. పంచవృత్తులందరినీ విశ్వబ్రాహ్మణులుగానే కులగణనలో నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

జీఓ–25 అమలు కోరుతూ వినతి

రజకుల కుల దూషణపై ఇచ్చిన జీఓ–25ను అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రజక సంఘాల అధికార ప్రతినిధి వి.లక్ష్మీకుమార్, జిల్లా రజక సంఘం అధ్యక్షుడు చాటపర్తి పోసిబాబు కోరారు. ఈమేరకు శనివారం ఏర్పాటు చేసిన కులగణన సదస్సులో కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌కు వినతి పత్రం అందజేశారు. రజకుల సంక్షేమానికి ప్రభుత్వం గతంలో విడుదల చేసిన జీఓ–25, 343లను అమలులో జాప్యం చోటుచేసుకుందని పేర్కొన్నారు. నేటికీ రజకులకు రాజ్యాధికారంలో వాటా దక్కలేదని కులగణన చేపడితే తమకు న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉందని తెలిపారు. కులగణనకు శ్రీకారం చుట్టిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

అయ్యప్ప ఆశీస్సులు నగర ప్రజలపై ఉండాలి



పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే నాని

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : అయ్యప్పస్వామి ఆశీస్సులు నగర ప్రజలపై ఉండాలని ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆకాంక్షించారు. శనివారం స్థానిక రామకోటి ప్రాంగణంలో అన్నపూర్ణ సహిత హరిహరపుత్ర అయ్యప్ప స్వామి అన్నదాన సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప పడిపూజా మహోత్సవంలో నాని పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ నగరంలో ప్రతి కార్తీక మాసంలో అయ్యప్ప మాలధారులు ప్రత్యేక పూజలతో నగరానికి ఆధ్యాత్మిక పరిమళాన్ని పంచుతున్నారని ప్రశంసించారు. రామకోటి ప్రాంగణంలో అన్నదాన సమాజం ఆధ్వర్యంలో మాలధారులకు భిక్ష ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. తొలుత అయ్యప్పస్వామికి శాకంబరి అలంకరణ చేశారు. కార్యక్రమంలో అన్నదాన సమాజం ప్రతినిధులు కొట్టు మధు, సామర్ల కిరణ్‌కుమార్, నూకల రామకృష్ణ, మద్దుల శ్రీనివాస గోపాల్, కొట్టు మనోజ్, వీరమాచినేని చందు, చదువాడి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అగ్గిపుల్లల్లో వరల్డ్ కప్, క్రీడా మైదానం ఆవిష్కరణ



అగ్గిపుల్లలతో ఏర్పాటుచేసిన ఇండియా, ఆస్ట్రేలియా క్రికెట్ ఫైనల్ మ్యాచ్



అగ్గిపుల్లలతో తయారు చేసిన ప్రపంచ కప్

ఏలూరు (టూటౌన్) : దేశమంతా క్రికెట్ ఫీవర్‌తో కొట్టుమిట్టాడుతోన్న వేళ ఏలూరుకు చెందిన సూక్ష్మ కళాకారుడు మేతర సురేష్‌బాబు అగ్గిపుల్లలతో వరల్డ్‌కప్, మైదానంలో ఫైనల్ మ్యాచ్‌లో తలపడనున్న ఇండియా, ఆస్ట్రేలియా ఆటగాళ్లను ఆవిష్కరించి అబ్బురపరచారు. ఫైనల్ మ్యాచ్‌లో ఇండియా గెలుపొంది కప్‌ను గెలుచుకున్నట్టుగా కప్‌కు చుట్టూ దేశ జెండాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 19న ఆదివారం జరిగే ఇండియా ఆస్ట్రేలియా ఫైనల్ మ్యాచ్‌లో ఇండియా గెలుపొంది కప్‌ను సొంతం చేసుకోవాలని ఆకాంక్షతో అగ్గిపుల్లలతో వీటిని సృష్టించినట్టు సురేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ని పలువురు కళాభిమానులు ఆయన్ను అభినందిస్తున్నారు.

ఇండియా టీం గెలవాలని పూజలు



పూజలు చేస్తున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : నేడు అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంలో భారత్ – ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగే ఐసీసీ వరల్డ్ కప్ క్రికెట్ పోటీల్లో ఇండియా టీమ్ విజయం సాధించాలని కోరుతూ ఏలూరు జిల్లా నంద నాయీబ్రాహ్మణ సంఘం ఇన్‌చార్జి రంభా రాజా ఆధ్వర్యంలో నాయీబ్రాహ్మణ ప్రతినిధులు శనివారం స్థానిక తూర్పువీధి కందికట్లువారి వీధి శ్రీరామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇప్పటికే భారత్ రెండుసార్లు విశ్వవిజేతగా నిలువగా ఈ ఏడాది తుది పోరులో విజయం సాధించాలని కోరుకుంటున్నామని తెలిపారు.

కౌశల్ వికాస్ యోజనలో శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 పథకంలో భాగంగా 3 నెలల స్వల్పకాలిక శిక్షణ స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రారంభించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ పి.రజిత ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఆపైన విద్యార్హతలు గల 15 నుంచి 45 సంవత్సరాల వయసు గల అభ్యర్థులకు జూనియర్ ఫీల్డ్ టెక్నీషియన్ – హోమ్ అప్లయెన్సెస్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులతో ప్రభుత్వ ఐటీఐ కళాశాల, ఇండస్ట్రియల్ ఎస్టేట్, సత్రంపాడు, ఏలూరు చిరునామాలో ఈ నెల 24లోపు నమోదు చేసుకోవాలని కోరారు. శిక్షణ పూర్తి చేసిన వారికి ప్రభుత్వ సర్టిఫికెట్ ఇస్తామని, ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు.

టెక్-బీలో రిజిస్టర్ చేయించుకోండి

ఏలూరు(ఆర్ఆర్‌పేట): హెచ్‌సీఎల్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెక్-బీ కోర్సుకు సంబంధించిన కార్యక్రమాల్లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదివే విద్యార్థులంతా రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రొత్సహించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ విద్య తరువాత ప్రతిష్టాత్మకంగా యూనివర్శిటీల్లో బీఈ, బీటెక్ వంటి ఉన్నత విద్యతో పాటు ఉద్యోగావకాశాలు కల్పించే ఈ కోర్సుల్లో అందరూ చేరేటట్లు చూడాలని సూచించామన్నారు. వివరాలకు హెచ్‌సీఎల్‌టెక్‌బీ ప్రతినిధుల ఫోన్ నెంబర్లు 96429 73350, 77807 54278, 63003 78377లో సంప్రదించవచ్చనన్నారు.

చేతివృత్తుల వారికి రుణాలు

ఏలూరు (టూటౌన్)/ఏలూరు(మెట్రో): చేతి వృత్తిదారులకు ఐదు శాతం వడ్డీతో రూ.3 లక్షల వరకు రుణాలు ఇవ్వనున్నట్టు మైనార్టీ కార్పొరేషన్ ఈడీ ఎన్ఎస్ కృపావరం శనివారం పేర్కొన్నారు. నాలుగేళ్లలో ఎంఎంఎస్‌ఎంఈ లోన్ క్రింద బ్యాకుల ద్వారా అనుషంగిక ఫ్రీ క్రెడిట్ సులభంగా లభిస్తుందన్నారు. దీనిని ఉద్దేశించి కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం ప్రారంభించిందని, దీనిని మైనార్టీ చేతి వృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ చేసే నాటికి కనీస వయస్సు 16 ఏళ్లు నిండి ఉండాలని, 18 సంప్రదాయ చేతి వృత్తుల్లో ఒకటయినా చేసుకునేవారయి ఉండాలని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో పీఎంఈజీపీపీఎం స్వానిధి, ముద్ర వంటి లోన్‌లు తీసుకుని ఉంటే, వాటిని చెల్లించిన వారే అర్హులన్నారు. ఆధార్ కార్డు, బ్యాంక్ పాసు బుక్, అడ్రస్ ప్రూఫ్స్, రేషన్ కార్డు / ఇతర ప్రభుత్వ ఆమోదం పొందిన డాక్యుమెంట్లు, ఆధార్ లింక్ అయిన ఫోన్ నెంబర్, పాన్ కార్డు (తప్పనిసరికాదు) ఉండాలని తెలిపారు. వివిధ వృత్తులు చేసుకుంటున్న వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కామన్ సర్వీస్ సెంటర్లు, వెబ్ సైట్‌ను సందర్శించాలని ఈడీ కృపావరం తెలిపారు.